క్లుప్తంగా

దరఖాస్తుల పరిశీలన

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అందిస్తున్న లక్షరూపాయల ఆర్థికసాయం దరఖాస్తుల పరిశీలన ప్రారంభించామని ఎంపీడీఓ రాజ్‌కుమార్‌ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలు గ్రామాల్లో అధికారుల బృందం దరఖాస్తులను ఇంటింటికీ తిరుగుతూ పరిశీలిస్తోందన్నారు. 37 గ్రామ పంచాయతీలకు సంబంధించి జూన్‌ 20 వరకు 527 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. జూలై 5వరకు పరిశీలన పూర్తి చేసి కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామన్నారు.

అధికారమే లక్ష్యంగా పని చేయండి

విజయకుమార్‌కు సూచించిన బండిసంజయ్‌



బండిసంజయ్‌తో మాట్లాడుతున్న డాక్టర్‌ విజయకుమార్‌

షాద్‌నగర్‌రూరల్‌: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్‌ అసెంబ్లీ కన్వీనర్‌ డాక్టర్‌ విజయకుమార్‌కు సూచించారు. శనివారం విజయకుమార్‌ బండిసంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై చర్చించారు. పార్టీ కార్యక్రమాల ఏర్పాట్లు, భవిష్యత్‌ కార్యాచరణపై దిశా నిర్దేశం చేసినట్లు డాక్టర్‌ విజయకుమార్‌ విలేకరులకు చెప్పారు.

సమయపాలన పాటించని బస్సులు

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

మొయినాబాద్‌: సమయానికి బస్సులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నాగిరెడ్డిగూడ ఇన్‌చార్జి సర్పంచ్‌ బట్టు లక్ష్మమ్మ అన్నారు. ఈ మేరకు శనివారం ఆమె మెహిదీపట్నం డిపో మేనేజర్‌ ఎస్‌.నారాయణ, డిప్యూటీ ఆర్‌.ఎం. డి.విజయభానుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తమ గ్రామం నుంచి ప్రతీ రోజు విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు నిత్యం నగరానికి వెళ్తుంటారని బస్సులు సమయపాలన పాటించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని వివరించారు. ఆర్టీసీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. వినతిపత్రం అందించిన వారిలో వార్డు సభ్యులు, గ్రామస్తులున్నారు.

పేదలకు అండగా సీఎంఆర్‌ఎఫ్‌

షాబాద్‌ జెడ్పీటీసీ సభ్యుడు అవినాశ్‌రెడ్డి

షాబాద్‌: సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు అండగా ఉంటుందని షాబాద్‌ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులంతా ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ శ్రీనివాస్‌గౌడ్‌, నాయకులు చెన్నయ్య, రాంచంద్రారెడ్డి, ఇనామత్‌ తదితరులున్నారు.తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే విద్యార్థులకు గుర్తింపు

ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు మాలతి

చేవెళ్ల: విద్యతోనే విద్యార్థులకు గుర్తింపు లభిస్తుందని చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు మాలతి అన్నారు. మండల పరిధిలోని దామరగిద్ద గ్రామానికి చెందిన ఏర్పుల మల్లిక ఐఐటీ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించినందుకు శనివారం ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు వేర్వేరుగా అభినందించి సన్మానించారు. అనంతరం ఆమె చదువులకు ఎంపీపీ రూ.25వేలు, జెడ్పీటీసీ 5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దామరగిద్ద సర్పంచ్‌ వెంకటేశంగుప్తా, మాజీ సర్పంచ్‌లు జంగారెడ్డి, నర్సింలు, నాయకులు మల్లారెడ్డి, వెంకటేశ్‌, బాబు, రమేశ్‌, మల్లేశ్‌, రఘు, అంజి, రామస్వామి, రామయ్య, కుమార్‌, రాములు,రాజు భీంరాజ్‌ హనోక్‌ తదితరులు పాల్గొన్నారు.

జూలై నుంచి తండాల్లోనే రేషన్‌

నందిగామ: గ్రామ పంచాయతీలకు అనుబంధంగా ఉన్న తండాల్లో జూలై నుంచి రేషన్‌ అక్కడే సరఫరా చేయాలని తహసీల్దార్‌ రహ్మత్‌ఖాన్‌ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతీ నెల అనుబంధ గ్రామాల వారు, తండా వాసులు రేషన్‌ కోసం మండల కేంద్రానికి వచ్చి ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్‌ జిల్లెల వెంకట్‌రెడ్డి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌కు వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే బండకుంట తండా, మద్యకుంట తండా, పెద్దకుంట తండాల్లో వచ్చే నెల నుంచి రేషన్‌ ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ మేరకు ఆయన మూడు రోజుల పాటు రేషన్‌ సరుకులు ఇవ్వనున్నట్లు చెప్పారు.



జేపీదర్గా ఆవరణలో గుంతల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్‌ వ్యర్థాలు

పట్టని నిషేధం

విచ్చలవిడిగా పాలిథిన్‌ కవర్ల వినియోగం

- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- గుట్టుగా విక్రయిస్తున్న వ్యాపారులు
- అవగాహన కల్పిస్తున్నా మారనితీరు

పర్యావరణం, జీవకోటి మనుగడకు హాని కలిగించే ప్లాస్టిక్‌ వినియోగాన్ని నిషేధించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు చర్యలు తీసుకున్న అధికారులు కొంతకాలం దుకాణాలపై దాడులు చేసి జరిమానాలు విధించినా.. ఆ తరువాత విస్మరించారు. దీంతో మళ్లీ విచ్చల విడిగా విక్రయిస్తున్నారు.

కొత్తూరు: ప్రజల ఆరోగ్యాలను దెబ్బతీయడం.. భూతాపం పెరగడంతో పాటు పలు విపత్తులకు కారణమయ్యే పాలిథిన్‌(ప్లాస్టిక్‌) ఉత్పత్తులపై ప్రభుత్వ నిషేధం మున్నాళ్ల ముచ్చటగా మారింది. దీనికి తోడు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన 30 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు పూర్తిస్థాయిలో ప్లాస్టిక్‌ ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేయాలని కోరుతూ వ్యాపారులకు అవగాహన కల్పించారు. పంచాయతీల నుంచి తీర్మానం చేసి నిషేధిత ప్లాస్టిక్‌ ఉత్పత్తులను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని నోటీసులు సైతం జారీ చేశారు. వ్యాపారులపై అధికారుల నిఘా కొరవడడంతో కొందరు వ్యాపారులు తిరిగి నాణ్యతలేని ప్లాస్టిక్‌ ఉత్పత్తులను యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. కొత్తూరు మున్సిపాలిటీ మొదలుకొని అన్ని పంచాయతీలు, అనుబంధ గ్రామాలు, గిరిజన తండాల్లోనూ పాలిథిన్‌ కవర్లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, హోటళ్లు, కిరాణం, కూరగాయలు, పండ్లు, ఇతర చిరు దుకాణాల్లోనూ అనుమతి లేని ప్లాస్టిక్‌ కవర్ల వినియోగం పెరిగిపోతోంది. 40 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న పాలిథిన్‌ సంచులను తయారు చేయడం, ఉపయోగించడం ప్రభుత్వం నిషేధించింది. వీటి నాణ్యతను గుర్తించే యంత్రాలు లేకపోవడం, సంబంధిత శాఖ అధికారుల అలసత్వం కారణంగా మండలంలో వీటి వాడకం పెరిగిపోయింది. మండల పరిధిలో ప్రతీ రోజుకు సుమారు 60 నుంచి 80 కిలోల వరకు పాలిథిన్‌ సంచుల విక్రయాలు సాగుతున్నాయి. గ్రామాల్లో పాలిథిన్‌ కవర్లను ఇళ్ల సమీపంలోనే కాల్చేస్తున్నారు. దీంతో విషపూరిత పొగ వ్యాపిస్తూ ప్రజలు అనారోగ్యం పాలవుతున్నామని వాపోతున్నారు.

ప్లాస్టిక్‌ వాడకంతో అనర్థాలు

- పాలిథిన్‌ కవర్లు లక్షల ఏళ్లయినా భూమిలో కరిగిపోకుండా భూ పొరల్లోనే పేరుకుపోయి భూతాపం పెరుగుతుంది.
- దీంతో భూమిలోకి నీరు ఇంకకుండా భూగర్భ జలమట్టాలు తగ్గిపోతాయి
- వరద ప్రవాహాన్ని అడ్డుకుని సమస్యలు తలెత్తుతాయి
- చెత్తకుప్పలో ప్లాస్టిక్‌ను పశువులు ఆహారంగా తీసుకుని ఉదరకోశ సమస్యలు ఉత్పన్నమవుతాయి.
- పాలిథిన్‌ గ్లాసులు, ఇతర ఉత్పత్తుల్లో టీ, వేడి ఆహార పదార్థలను తీసుకోవడంతో అనారోగ్య సమస్యలు తతెత్తుతాయి.
- జనావాసాల మధ్య కాల్చడంతో విషపూరితమైన పొగతో శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం.

ప్రజల భాగస్వామ్యం ప్రధానం



మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న కవర్లను విక్రయించవద్దని సూచించాం. తనిఖీల్లో నిబంధనలు పాటించని వ్యాపారస్తులకు జరిమానా విధించాం. ప్రజలు స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ వాడడం మానేసి పర్యావరణ పరిక్షణలో భాగస్వాములవ్వాలి

– లావణ్య, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌, కొత్తూరు

తొమ్మిదేళ్లలో 80 కోట్ల రేషన్‌ కార్డులు



మహిళలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అందె బాబయ్య తదితరులు

- మూడు కోట్ల మందికి పక్కా ఇళ్లు
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబయ్య

షాద్‌నగర్‌రూరల్‌: దేశంలో రైతు సంక్షేమం, మహిళా సాధికారతే ధ్యేయంగా బీజేపీ పని చేస్తుందని పార్టీ రాష్ట్ర క్యావర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. మహా సంపర్క్‌ అభియాన్‌ కార్యక్రమంలో భాగంగా శనివారం పార్టీ మండల అధ్యక్షుడు దొడల వెంకటేష్‌యాదవ్‌ ఆధ్వర్యంలో ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని రంగంపల్లి, కందివనం గ్రామాల్లో నాయకులు ఇంటింటికి కరపత్రాలను పంచుతూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో ప్రదాని తొమ్మిదేళ్ల సుపరిపాలనను పూర్తి చేసుకున్నారన్నారు. అంత్యోదయ స్పూర్తితో గరీబ్‌ కల్యాణ్‌ యోజన పథకంద్వారా సుమారు 80కోట్ల ఉచిత రేషన్‌ కార్డులను అందజేశారని చెప్పారు. 3 కోట్ల మందికి ప్రధాన మంత్రి ఆవాస్‌ యోజన పథకం కింద పక్కా ఇల్లు మంజూరయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో కిసాన్‌ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు భీమయ్య, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సురేశ్‌, నాయకులు అజయ్‌, రవిగౌడ్‌, కుమార్‌, లింగం, శ్రీను, బాబు, సురేశ్‌, చెన్నయ్య, శివకుమార్‌, శ్రీకాంత్‌, రమేశ్‌, ప్రవీణ్‌, శ్రవణ్‌, కల్యాణ్‌, శ్రీరామ్‌, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ బీజేపీ

నందిగామ: వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని బీజేపీ సీనియర్‌ నాయకుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని చేగూరులో పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్‌ ఆధ్వర్యంలో మహా జన్‌ సంపర్క్‌ అభియాన్‌ కార్యాలయంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోహన్‌సింగ్‌ నాయక్‌, ప్రదీప్‌, సత్యం, ప్రశాంత్‌, రాజు, శ్రీశైలం, విశ్వనాథం, జంగయ్య, ప్రశాంత్‌ పాల్గొన్నారు.

చెరువు శిఖం భూమి కబ్జాకు యత్నం

స్పందించిన రెవెన్యూ అధికారులు



మట్టి నింపిన స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్‌ అధికారులు

కేశంపేట: చెరువు పక్కన భూమిని కొనుగోలు చేసిన రియల్టర్లు శిఖం భూమి కబ్జా చేసేందుకు యత్నించారు. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడకు చేరుకున్న అధికారులు రెండు రోజుల్లో మట్టిని తొలగించాలని హెచ్చరించారు. వివరాల ప్రకారం.. బైర్కన్‌పల్లి గ్రామ శివారులో సర్వేనంబర్‌ 132/2, లో 5.23ఎకరాల భూమిని నగరానికి రియల్టర్లు కొనుగోలు చేశారు. ఈ భూమిలో కొంత భాగం అమ్మచెరువు శిఖంలో ఉంది. చెరువు నిండుగా ఉండడంతో కొంత భూమి అందులోనే కలిసిపోయింది. విషయం తెలిసే కొనుగోలు చేసిన రియల్టర్లు చెరువులో ఉన్న భూమి హద్దును ఏర్పాటు చేసుకుని అక్కడి వరకు ఎత్తు పెరిగేలా మట్టి నింపారు. పెద్దగోతి తీసి పైపులను ఏర్పాటు చేసి వర్షాపు నీరు అందులోంచి వెళ్లేలా ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ అజీం అలీ రెవెన్యూ అధికారి నివేదితను అక్కడి పంపించారు. ఆమెతో పాటు ఇరిగేషన్‌ ఏఈ గీత అక్కడకి చేరుకుని రియల్టర్లు అక్రమంగా శిఖంలో మట్టిని నింపుతున్నట్టు గుర్తించారు. రెండు రోజుల్లోగా మట్టిని తరలించాలని భూమి వద్ద ఉన్న వ్యక్తిని హెచ్చరించారు.

విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల కాడెడ్లు మృతి

షాబాద్‌: విద్యుదాఘాతంతో ఓ కాడెద్దు మృతి చెందింది. ఈ ఘటన మండల పరిధిలోని తిర్మలాపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం గ్రామానికి చెందిన కావలి శ్రీనివాస్‌ తన పశువులను పొలానికి తోలుకెళ్తున్నాడు. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్‌ వైర్‌ తగిలి విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.70 వేల వరకు ఉంటుందని ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. కంచె ఏర్పాటు చేయాలని విద్యుత్‌ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కేతిరెడ్డిపల్లిలో ఒంగోలు గిత్త



మొయినాబాద్‌ రూరల్‌: ఎద్దు కళేబరాన్ని పరిశీలిస్తున్న నాయకులు, గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్‌: ఒంగోలు జాతికి చెందిన ఓ గిత్త శనివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది.ఈ ఘటన మండల పరిధిలోని కేత్తిరెడ్డిపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎం.డి. జిలానీ శనివారం ఉదయం తన పశువులను పొలానికి తోలుకెళ్తున్నాడు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి విద్యుత్‌ వైర్‌ తెగిపడింది. ఎద్దు కాళ్లకు విద్యుత్‌ వైరు తగలడంతో విద్యుత్‌షాక్‌ తగిలి మృతి చెందింది. విషయం తెలుసుకున్న సర్పంచ్‌ శోభ, సర్దార్‌నగర్‌ మార్కెట్‌ కమిటీ మాజీ వైస్‌ చైర్మన్‌ వెంకట్‌రెడ్డి ఘటనా స్థలికి చేరకునికి బాధుతుడిని ఓదార్చారు. ఎద్దు విలువ దాదాపు రూ.1.30లక్షలు ఉంటుందని ప్రభుత్వ తనను ఆదుకోవాలని కోరాడు.

సేంద్రియ ఎరువులతోనే మేలైన సాగు

కొత్తూరు: రైతులు సాంకేతికతను వినియోగించుకుని పంటలను సాగుచేయాలని ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. శనివారం వారు దత్తత తీసుకున్న మల్లాపూర్‌ గ్రామంలో రైతులకు పత్తి, వరితో పాటు ఇతర విత్తనాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతులు పంటల సాగులో వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలన్నారు. భూసార పరీక్షలు చేపట్టి తగిన ఎరువులను వినియోగించాలన్నారు. సాధ్యమైనంత వరకు రైతులు సేంద్రియ ఎరువులను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రమేశ్‌, శైలజ, పరమేశ్వరి, సర్పంచ్‌ సాయిలు, మధుసూదన్‌రావు, మోహన్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, రంగారెడ్డి, రవీందర్‌రెడ్డి, యాదిరెడ్డి, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

టిఫిన్‌ బాక్స్‌ల పంపిణీ

షాబాద్‌: మండల పరిధిలోని మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ, మాచన్‌పల్లి తండాల్లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం టిఫిన్‌ బాక్స్‌లు అందజేశారు. ఈ సందర్భంగా దాత నీరటి అంజమ్మ మాట్లాడుతూ.. ఇటీవల తన కుమారుడు నీరటి శివకుమార్‌ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన జ్ఞాపకార్థం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టిఫిన్‌ బాక్స్‌లు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు మహేందర్‌, రాజశేఖర్‌, నరేందర్‌గౌడ్‌, రవీందర్‌, నరేశ్‌, రాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దశలవారీగా గ్రామాభివృద్ధి

మొయినాబాద్‌రూరల్‌: దశలవారీగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంగామని సర్పంచ్‌ల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రాఘవరెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని బాకారంలో ఎంపీపీ నిధులతో చేపట్టిన యూజీడీ పనులను, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌ నిధులతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ మాట్లాడుతూ.. అందరి సహకారంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ శ్రీనివాస్‌యాదవ్‌, వార్డు సభ్యుల పోరం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, శ్రీనివాస్‌, పెంటిబాబు, శంకరయ్య, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేందర్‌ముదిరాజ్‌, కృష్ణ, మల్లేశ్‌, రాజు, అనిల్‌, శేఖర్‌గౌడ్‌, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలి

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్‌

శంకర్‌పల్లి: మేడే సందర్భంగా సీఎం కేసీఆర్‌ పారిశుధ్య కార్మికులకు ప్రకటించిన వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్‌ డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం శంకర్‌పల్లి మున్సిపల్‌ కార్యాలయంలో కమిషనర్‌ జ్ఞానేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు రమేశ్‌, కోశాధికారి రాములు, ఉపాధ్యక్షుడు కృష్ణ, రాజేందర్‌, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

యాదవుల బలోపేతానికే గొర్రెల పంపిణీ

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మేడిపల్లిలో గొర్రెలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌: రెండు విడతలో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం 30,090 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మొయినాబాద్‌ మండల పరిధిలోని మేడిపల్లిలో శనివారం గొల్ల కురుమలకు 12 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గొల్ల కురుమలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం ప్రారంభించిందన్నారు. జిల్లాలో ఇప్పటికే మొదటి విడతలో 11,623 యూనిట్ల గొర్రెలు పంపిణీ చేశామన్నారు. గొర్రెలు తీసుకున్న గొల్లకురుమలు గొర్రెల ఉత్పత్తి చేసే స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌, వైస్‌ ఎంపీపీ మమత, సర్పంచ్‌లు ప్రవీణ్‌కుమార్‌, రత్నం, కుమార్‌, ఎంపీటీసీ సభ్యులు అంజయ్య, శ్రీనివాస్‌, మల్లేశ్‌, ఎంపీటీసీ మాజీ సభ్యుడు వెంకటేశ్‌, నాయకులు జయవంత్‌, సుధాకర్‌యాదవ్‌, మల్లేశ్‌, డప్పు రాజు, యాదయ్య, బాల్‌రాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూడండి.. అవకాశం కల్పించండి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌

ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌

కేశంపేట: బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను చూసి మరో మారు ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ అన్నారు. శనివారం మండల పరిధిలోని చౌలపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్‌ నాయకులు గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. అనతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధిని చూసే ప్రజలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో పుల్లయ్య, మహేశ్‌, హరికిషన్‌, రమేశ్‌, చిన్నయ్య, గోవర్ధన్‌, పెద్దరామయ్య, నరేశ్‌, నరసింహ, శివకుమార్‌, సురేశ్‌, జంగయ్య, శివయ్య, స్వామి తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మండల కోఆప్షన్‌ సభ్యుడు జమాల్‌ఖాన్‌, సత్యనారాయణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పార్కు స్థలం కబ్జాను ప్రతిఘటించాలి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌



గ్రామస్తులతో మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌రూరల్‌: ప్రజలందరి అవసరాలకోసం ఏర్పాటు చేసిన పార్కు స్థలాన్ని కబ్జా చేస్తే ఊరుకోవద్దని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్‌ గ్రామస్తులకు సూచించారు. ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని కొండన్నగూడ గ్రామంలో పార్కు స్థలం కబ్జా విషయాన్ని తెలుసుకున్న శంకర్‌ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కు స్థలాన్ని ఆక్రమిస్తే గ్రామస్తులంతా ప్రతిఘటించాలని సూచించారు. పార్కు స్థలం అన్యాక్రాంతం అవుతుంటే అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. నాయకులు యాదయ్య యాదవ్‌, బాబర్‌అలీఖాన్‌, బాల్‌రాజ్‌గౌడ్‌, శ్రీకాంత్‌రెడ్డి, సురేశ్‌గౌడ్‌, సాయిలు, కృష్ణ, యాదయ్య, దర్శన్‌, మహిపాల్‌రెడ్డి, అశోక్‌, శేఖర్‌ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి



శంకర్‌పల్లి: విద్యార్థినులకు సైకిళ్లు అందజేస్తున్న వాల్మీకి ఫౌండేషన్‌ సభ్యులు

పద్మశ్రీ అవార్డు గ్రహీత మంజుల

శంకర్‌పల్లి: విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యాన్ని ఏర్పరుచుని దాన్ని సాధించేందుకు శ్రమించాలిన పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్‌ మంజుల అనగాని అన్నారు. శనివారం వాల్మీకి ఫౌండేషన్‌ 15వ వార్షికోత్సవం సందర్భంగా ఆమె అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌ క్రీడాకారిణి ఖాదర్‌వల్లి కృష్ణప్రియతో కలిసి స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌(బాలుర), కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు శానిటరీ ప్యాడ్స్‌, వేయి మంది విద్యార్థులకు బ్యాగులు, 20 మందికి సైకిళ్లు, పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కాగా పేదల విద్యాభివృద్ధికి వాల్మీకి పౌండేషన్‌ చేస్తున్న సేవలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్‌ చైర్మన్‌ గణేశ్‌ వాల్మీకి, ప్రధాన కార్యదర్శి హరికిషన్‌ వాల్మీకి, సభ్యులు వాణి, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి, కౌన్సిలర్‌ శ్వేత, కేజీబీవీ పాఠశాల ప్రిన్సిపాల్‌ మధురవాణి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్‌ ఉమామహేశ్వరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దాతల సాయం మరువలేనిది

చేవెళ్ల: పేద విద్యార్థులకు సాయం అందించేందుకు దాతలు ముందుకురావాలని గంగిడి మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని గుండాల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్‌ పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గణేశ్‌, జంగయ్య, రాజశేఖర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, సందీప్‌, సురేశ్‌, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి

ఎస్టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య

మొయినాబాద్‌ రూరల్‌: విద్యార్థులు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని ఎస్టీఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు యూ.పోచయ్య, ఎంఈఓ ఎం.వెంకటయ్య అన్నారు. శనివారం మండల పరిధిలోని ఎన్కేపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో భాస్కర్‌ మెడికల్‌ డెంటల్‌ కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.